
# విషవలయం

—కొవ్వూరి



ప్రభాకరరావు క్లాసుకు, చేపల మార్కెట్‌కు భేదం ఏమీ వుండదని చాలామంది అంటారు. చేపల మార్కెట్టే కొంచెం ప్రశాంతంగా ఉంటుందని చదువుమీద శ్రద్ధగల విద్యార్థులకనిపిస్తుంది. ప్రిపేరయ్యొచ్చిన పాఠం అర్ధగంటకే ఐపోతుంది. మిగతా అర్థగంట లోకాభిరామాయణం, ఎవ్వరైన ఏదైనా అర్థంకాలేదని అడిగితే డిపార్ట్‌మెంట్‌కొచ్చి కలు. చెప్తాను అంటాడు బింకంగా. నిజమేననుకుని నమ్మి డిపార్ట్‌మెంటుకెళ్ళి తిట్లు తిన్న విద్యార్థులూ వున్నారు. వాళ్ళలో సత్యన్నారాయణ ఒకడు.

* * *

సత్యన్నారాయణ కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి.

పుస్తకంలో అక్షరాలు అల్లుకుపోయి గజిబిజిగా కనపడుతున్నాయి.

ఐనా, నాన్న అన్ని మాట

లెందుకన్నాడు.

తనకు ఫిజిక్స్, ఇంగ్లీషు అర్థం గావడంలేదు. ట్యూషన్‌లో చేరతానన్నాడు. తను క్లాసులెగ్గొడుతున్నాడా, చదవడం లేదా, కాలేజీలో చేరిన వెంటనే కళ్ళు నెత్తికొచ్చాయా? ఎన్ని మాటలన్నాడు నాన్న.

రాత్రి పదింటిదాకా కుస్తీ పడుతున్నాడు పుస్తకాలతోటి. ఐనా అర్థం! అయితేనా! ఇంతవరకు ట్యూషన్ ఎరుగనితను, ఎందుకు కావాలన్నాడిప్పుడు? నాన్న అర్థం చేసుకోడేం?

తనకు మంచి మార్కులతో పాస్ కావాలని, మెడిసన్‌లో సీట్ తెచ్చుకోవాలని లేదా!

కాని, తనకేం అర్థంగావడం లేదే!

మంచి భవిష్యత్ మీద ఆశలు పెట్టుకుని ఒళ్ళు వంచి కష్టపడుతూ పుస్తకాలే ప్రపంచమనుకునే సత్యన్నారాయణ, సామాన్యుడి కొడుకు. పాఠాలర్థంగాక, నాన్న ట్యూషన్‌లో చేర్పించక పోగా నడవడినే శంకించాడనే ఖేదంతో కన్నీళ్ళు కారుస్తూ అల్లుకుపోయిన అక్షరాల పుస్తకంలోకి శూన్య దృక్కులతో చూస్తున్నాడు.

"మనాదేనా?" ప్రక్కనున్న లెక్చరర్‌ని అడుగుతున్నాడు ప్రభాకరరావు.

"కాదు."

"నేనప్పుడే అనుకున్నాను మీ దగ్గర ట్యూషన్ చేరినప్పుడే." ఆ మాటలు సత్యన్నారాయణ విన్నాడు.

"మనాదేనా?" అన్న మాట అతని చెవుల్లో మార్మోగుతోంది.

* * *

సత్యనారాయణ పిచ్చిగా చూస్తున్నాడు.

తనెంత కష్టపడుతున్నాడు. రాత్రి ఎంత పొద్దుపోయేదాకా చదువుతున్నాడు. ఏదో ఒక చిన్న ప్రశ్నకు జవాబు చెప్పలేనంత మాత్రాన.

"ఏమిటి చెప్పుతున్నది వినబడుతుందా? ఈ జన్మలో పాస్ కాలేవు"

"బాగానే చదువుతున్నాను సార్."

"చదువుతున్నావా, ఐనా బుర్రలో ఏమన్నా ఉండొద్దు ఎక్కడానికి? ఒక సంవత్సరం పోతేపోయింది గ్రూప్ మార్చుకో" సలహా ఇచ్చాడు ప్రభాకరరావు.

సత్యనారాయణ మాట్లాడలేదు.

"నీ ఇష్టం. ఉన్నమాట చెప్పా, తలక్రిందులుగా తపస్సు చేసినా ఈ జన్మలో సైన్సుగ్రూప్‌తో పాస్

కాలేవు. కూర్చో ఎందుకిలా దిష్టి బొమ్మలా నిలబడతావ్, నెక్స్ట్."

రాత్రి పుస్తకం పట్టుకు కూర్చున్న సత్యనారాయణకు "ఈ జన్మలో పాస్ కాలేవు" అని ప్రతి పేజీ వెక్కిరించినట్లు-నిద్రపట్టలేదు. గుండెను భయం పీకుతుంది—

* * *

"నీ రిజిష్టర్ నెంబరెంత?"

సత్యనారాయణ చెప్పాడు.

"ఎందుకాలస్యమైంది?"

"దారిలో సైకిల్ పంక్చరైందండి."

"క్లాసులో కూడా ఇతనింతే సార్। ఇర్రెగ్యులర్. పంక్చువల్‌గా ఉండడు" స్కిల్ అసిస్టెంట్ ప్రభాకరరావు వ్యాఖ్య.

"రికార్డ్ ఇక్కడ పెట్టు. ఇదిగో అన్సర్ పేపర్. అటెండరు సీటు చూపిస్తాడు. వెళ్ళి ప్రాక్టికల్ చేయి" ఎగ్జామినర్ చెప్పాడు.

సత్యనారాయణ తన ప్లేస్‌కెళ్ళి నించున్నాడు. ముఖానికి పట్టిన చెమటను చొక్కాతో తుడుచుకున్నాడు. కర్చీఫ్ లేదు, కాళ్ళు వణుకుతున్నాయి.

ఎలక్ట్రిసిటీలో ఎక్స్‌పర్‌మెంట్. బొమ్మ గీసాడు. తప్పనిపించింది. కొట్టేశాడు. మళ్ళీ ప్రయత్నించాడు. గుర్తు రాలేదు.

"ఈ జన్మలో పాస్ కాలేవు" ప్రభాకరరావుదీ వెనగుర్తుకొచ్చింది. ఈయనే రావాలా స్కిల్ అసిస్టెంట్‌గా, ఖర్మ గాకపోతే, సత్యనారాయణ కేడుపు వస్తోంది.

ప్రాక్టికల్ ఎగ్జామినర్ స్టాఫ్ రూమ్‌లోకి వెళ్ళాడు. ప్రభాకరరావు స్టూడెంట్స్ దగ్గరకు అప్పుడప్పుడు వచ్చి హింట్ ఇస్తున్నాడు తన దగ్గరకు కూడా వస్తాడేమోనన్న సత్యనారాయణ ఆశ నిరాశ కాలేదు.

వచ్చాడు—

"ఏం అలాగే నుంచున్నావ్? కానీ టైమ్ అవుతుంది. ఏం? బొమ్మ కూడా వెయ్యలేదా? మీకసలెందుకొస్తారో మా ప్రాణం తియ్యడానికి, కానీ త్వరగా" అని వెళ్ళిపోయాడు-సత్యనారాయణకు-వాళ్ళ నాన్న తొడుక్కునే మాసికలువేసిన పాతచొక్కా గుర్తుకొచ్చింది. వాళ్ళ అమ్మ చేసే అర్ధ భోజనం గుర్తుకొచ్చింది. వాళ్ళుండేగదిని రెండుగా వేరు చేయడానికి అడ్డం పెట్టిన చిల్లులు తడిక గుర్తుకొచ్చింది. ఇంటి వాళ్ళు మైన్ ఆఫ్‌చేసాక లాంతరు గుడ్డి వెలుగులో తనుచేసిన బండ చాకిరి గుర్తుకొచ్చింది. మంచి భవిష్యత్‌కోసం, దారిద్ర్యాన్ని పారదోలడం కోసం, అమ్మనాన్నను

సుఖపెట్టడం కోసం, తమ్ముళ్ళ అభివృద్ధికోసం, వేసుకున్న పథకాలు గుర్తుకొచ్చాయి. కాని, బొమ్మ గుర్తుకు రాలేదు. కనెక్షన్ గుర్తుకు రాలేదు.

కాలం పరుగిడుతుంది. సత్యనారాయణ మేధాశక్తికి పరీక్ష. మేధను మర్చిపోయి, గ్రహణశక్తిని మర్చిపోయి, జ్ఞాపకశక్తికి పరీక్ష తయారయింది. చివరకు బొమ్మ గీశాడు. ప్రయోగం చేశాడు. ఏవో రీడింగ్స్ వేశాడు-అన్సర్ వ్రాసాడు.

రెండు గంటలయ్యాక బయటికొచ్చాడు.

రికార్డ్ తిరగేసి కరెక్టు అన్సర్ చూసుకోలేదు. తప్పుగాని, ఒప్పుగాని చేసాడు. ఇప్పుడే ఫలితం చూసుకోదల్చుకోలేదు.

ఎంత హీనంగా చేసినా ప్రాక్టికల్స్‌లో మినిమం మార్కులు ఎటూ వస్తాయి. థియరీ బాగానే వ్రాశానన్న తృప్తి ఉంది.

"వీళ్ళంతా ఫస్ట్ క్లాసు స్టూడెంట్స్ సార్" ప్రభాకరరావు ప్రాక్టికల్ ఎగ్జామినర్‌కి కొన్ని నెంబర్లిచ్చాడు.

ఎగ్జామినర్ అర్థం చేసుకున్నాడు వీళ్ళందరు కావల్సిన స్టూడెంట్స్ అన్నమాట. పూర్తి మార్కులు వెయ్యాలి. ఈరోజు తను వేస్తే రేపు ప్రభాకరరావు తమ సెంటర్‌కొచ్చినప్పుడు తన ట్యూషన్ పిల్లలకు వేస్తాడు. పరస్పర సహాయం అంతే.

సహజంగా ఆ నెంబర్లలో సత్యనారాయణ లేడు.

ప్రభాకరరావు హుషారుగా ఉన్నాడు.

పదివేలు కట్టి ఉద్యోగంలో చేరినందుకు ఫలితం బాగానే ఉంది. మూడెకరాల మాగాణి, 50 వేల క్యాష్‌తో పెళ్ళి కుదిరింది.

"మొత్తానికి మంచి ఛాన్సు కొట్టావు గురూ."

"ఏం ఛాన్సులే. అసలు ఒక లకారం దాటాల్సింది. మార్కెట్ మందంగా వుంది. అమ్మాయి నచ్చింది, కట్నం తగ్గినా ఫర్వాలేదులే అనుకున్నాను."

"అదృష్టం ప్చ్! ఏం చేద్దాం. నాకుద్యోగం పెళ్ళయిన తర్వాత వచ్చింది" మరొకరు వాపొయ్యారు.

స్టాఫ్‌తో తన సంతోషం పంచుకోవడంకోసం ఆ రాత్రి బార్‌లో మందు పార్టీ జరిగింది.

స్పెషల్ రూమ్‌కి వీళ్ళకన్న ముందే చేరిన కొందరు విద్యార్థులు

స్టాప్‌ను చూపి జంకు పడలేదు. ప్రభాకరరావు ఆనందంలో వాళ్ళు భాగం పంచుకొన్నారు.

తూలుతూ, సోలుతూ "అధ్యాపకుల విద్యార్థుల ఐక్యత వర్థిల్లాలి" బిగ్గరగా వాళ్ళిచ్చిన స్లోగన్స్ చూసే వాళ్ళకు కొంచెం ఎబ్బెట్టుగా అనిపించాయి.

* * *

సత్యనారాయణ వేకువనే లేచాడు. మూడింటికొచ్చే ట్రైన్‌లో పేపర్లు వస్తాయి. రిజల్ట్స్ వచ్చేదీ రోజే. ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపాడు, ఎంత శ్రమించాడు. బయాలజీ బొమ్మలు చేతులు నొప్పి పుట్టేదాకా ఎన్నిసార్లు గీశాడు. కెమిస్ట్రీ ఈక్వేషన్లు ఎన్నిమార్లు వ్రాసాడు. ఫిజిక్స్, థియరీ బాగానే వ్రాసాడు. ప్రాక్టికల్స్ మొదట కంగారుపడ్డా సరిగానే చేసాడు.

చన్నీళ్ళ స్నానంచేసి సైకిల్ తీసుకుని స్టేషన్‌కు వెళ్ళాడు. అప్పటికే మిత్రులు కొంతమంది అక్కడున్నారు ట్రైన్ వచ్చింది. పేపర్ కట్టలు దిగాయి.

స్టూడెంట్స్ ఎగబడ్డారు. నవ్వేవాళ్ళు, ఏడ్చేవాళ్ళు వాళ్ళ జీవితాలు ఆ నెంబర్ల మీద ఆధారపడ్డాయి. రద్దీ తగ్గాక సత్యనారాయణ పేపర్ చూసాడు. నంబర్ లేదు. ఏ క్లాసు లోనూ లేదు.

పరీక్ష పోయింది. నమ్మలేకపోయాడు. చేపలమార్కెట్ ఫిజికల్ క్లాస్, నువ్వు ఈ జన్మలో పాస్ కాలేవు దీవన. ప్రాక్టికల్ ఎగ్జామ్స్ మనాడేనా? తను ట్యూషన్‌లో చేరతాననటం తండ్రి తిట్లు, ఆయన అశక్తత, తన ఆశలు, ఆశయాలు, తమ కడుపులునింపి మిగతా మెతుకులతో సరిపెట్టుకునే అమ్మ, చిల్లుల తడిక, పంక్చరయిన సైకిల్, ఇతడు ఎప్పుడూ ఇంతేసార్, ఇరెగ్యులర్.

అవును. నా జీవితమే ఇరెగ్యులర్. దీన్ని సరిచేయాలి. పేపర్ మడచి ప్లాట్‌ఫారం మీద పెట్టాడు. ట్రైన్ కదలబోతుంది.

సత్యనారాయణ ఒక సామాన్యుని కొడుకు. జీవితంమీద ఆశలెన్నో పెట్టుకుని వాటిని నెరవేర్చుకోవడంకోసం కష్టపడి కూడా ఫలితం సాధించుకోలేక రైలు క్రింద పడ్డాడు. అదే రైలు- పేపర్ల కట్ట మోసుకొచ్చిన రైలదే!

సూర్యనారాయణ, సత్యనారాయణ తమ్ముడు. అదే కాలేజీలో అదే క్లాసులో చేరాడు.

ప్రభాకరరావు అదే క్లాసుకు వచ్చాడు. యాదృచ్ఛికమా ఇది? కాదు- విషవలయం! *